# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-07-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ మంత్రి రాందాస్ అథవాలే ఈరోజు చిత్తూరు జిల్లాలో పర్యటిస్తారు.**
2. **విద్యుత్తును ఆదా చేసేందుకు ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
3. **తెలంగాణలోని ప్రతి నియోజకవర్గంలో బాలబాలికలకు వేర్వేరుగా రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.**
4. **అదనపు రసాయన ఎరువులు సరఫరా చేయాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రమంత్రులకు లేఖ రాశారు.**
5. **నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానంతో చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి వంగల పూడి అనిత తెలిపారు.**

=========================

కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ మంత్రి రాందాస్ అథవాలే ఈరోజు చిత్తూరు జిల్లాలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు కేంద్ర ప్రభుత్వం అందించే సహాయ జీవన పరికరాలను కేంద్ర మంత్రి అందజేస్తారు. కేంద్రమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

--------------------------

విద్యుత్తును ఆదా చేసేందుకు ప్రతి ఇంట్లో సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు నిన్న ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. అనంతరం తుమ్మిశిలో నిర్వహించిన ప్రజావేదిక సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ..

- వాయిస్ .. 30 సెకన్లు

కాగా ఈరోజు కుప్పం ప్రభుత్వాస్పత్రిలోని నెర్వ్‌సెంటర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. అనంతరం శివపురంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఈ సాయంత్రం పార్టీ నాయకులతో సమావేశం అవుతారని అధికారులు తెలిపారు.

--------------------------

తెలంగాణలో ప్రతి నియోజకవర్గంలో బాలబాలికలకు వేర్వేరుగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని విద్యాశాఖపై పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిన్న అధికారులతో సమీక్షించారు. ప్రతీ యంగ్ ఇండియా పాఠశాలలో జాతీయ జెండా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ భవన నమూనాను ఆయన పరిశీలించారు.

---------------------------

కేంద్రప్రభుత్వం 1975లో నాటి మంత్రి వర్గం ఆమోదం లేకుండానే “అత్యవసర పరిస్థితి” ఎమర్జన్సీ విధించారని కేంద్ర గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నారాయణగూడ కేశవ మెమోరియల్ కళాశాలలో మాక్ పార్లమెంట్ సెషన్ నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ..

వాయిస్ ..33 సెకన్లు

---------------------------

ఖరీఫ్ కాలానికి రసాయన ఎరువులు సరఫరా చేయాలని కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్, జేపీ నడ్డాలకు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిన్న లేఖ రాశారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రాష్ట్రానికి కేటాయించిన యూరియా సరఫరాలో 1.94 లక్షల టన్నుల లోటు ఏర్పడిందన్నారు. తద్వారా రైతులకు సకాలంలో యూరియాను అందించేందుకు అదనపు ఎరువులను కేటాయించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.

---------------------------

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో ‘సుపరిపాలనలో తొలి అడుగు 4.1’ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా నిన్న కృష్ణా, గుంటూరు, నంద్యాల, జిల్లాలలో ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలతో పాటు ఆయా నియోజకవర్గాలు, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేసిన కృషి వంటి అంశాలను మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు ప్రజలకు వివరించారు.

---------------------------

నేరాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానంతో చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు కాకినాడ జిల్లా తునిలో జైలు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెట్రోల్ బంకును ఆధునీకరించిన ఉప కారాగారాన్ని శాసనసభ్యులు దివ్యతో కలిసి మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి అనుగుణంగా పని చేయాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు – నడిపల్లి కోట గ్రామాల మధ్య ఉన్న రహదారిని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి రహదారి పరిస్థితిపై అధికారులతో చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..

వాయిస్…27 సెకన్లు

---------------------------

ప్రముఖ తెలుగు చలనచిత్ర నటుడు ఎస్.వి.రంగారావు జయంతి ఈరోజు. 1918 జూలై 3వ తేదీన ఆయన కృష్ణాజిల్లా నూజివీడులో జన్మించారు. ఆయన పూర్తి పేరు సామర్ల వెంకట రంగారావు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 3 వందలకు పైగా చలనచిత్రాల్లో నటించిన ఆయన రావణుడు, హిరణ్యకశపుడు, ఘటోత్కచుడు, కంసుడు లాంటి ప్రతినాయక పాత్రల్లోనే కాక అనేక సహాయ పాత్రల్లో తనదైన ముద్ర వేశారు. నర్తనశాలలో ఆయన నటనకు భారత రాష్ట్రపతి పురస్కారమే కాక.. జకార్తాలో జరిగిన ఆఫ్రో యేషియన్ చలనచిత్రోత్సవ పురస్కారం కూడా లభించింది. 1974 జూలై 18వ తేదీన ఆయన తుదిశ్వాస విడిచారు. ఎస్.వి.ఆర్ జయంతి సందర్భంగా ఆయన మాటలను ఒకసారి గుర్తుచేసుకుందాం....

..వాయిస్ ... 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు ఇంటర్మీడియట్ విద్యా శాఖ డైరెక్టర్ కృతికా శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల అభ్యర్థన మేరకు ప్రవేశాల గడువును పొడిగించినట్లు  పేర్కొన్నారు. పదవ తరగతిలో సప్లిమెంటరీ పరీక్షలతో కలిపి మొత్తం 5 లక్షల 92 వేల 602 మంది ఉత్తీర్ణత సాధించగా ఇప్పటి వరకు ఇంటర్మీడియట్‌లో 4 లక్షల 90 వేల మంది ప్రవేశాల పొందినట్లు వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో జూన్ 6 నుంచి జూలై 2 వరకు 23 రోజుల పాటు ఉపాధ్యాయులకు నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు నిన్నటితో ప్రశాంతంగా ముగిశాయని డీఎస్సీ కన్వీనర్ ఎం.వి.కృష్ణారెడ్డి తెలిపారు. డీఎస్సీలో భాగంగా అన్ని పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో 91.72శాతం మంది పరీక్షలకు హాజరయ్యారని వెల్లడించారు. ఈరోజు నుంచి అభ్యర్థుల సహాయం కోసం 8125046997 నెంబర్‌తో పాటు మరిన్ని హెల్ప్‌లైన్ నంబర్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...20 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================